భట్టిప్రోలు నాగసుందరి సంక్రాంతి కథానికల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ

కథ

# మానవ సేవ

మొక్కపాటి శ్యామల

నాన్న పోయిన చాలా కాలానికి నాన్న చెప్పిన మొక్కు తీర్చటానికి మా సొంత గ్రామానికి బయలుదేరాను. మాకు ఆ పల్లెటూర్లో ఉన్న కొద్దిపాటి ఆస్తి, మంచి బేరం వచ్చి, అమ్ముడుపోయి, అక్కపెళ్ళి– నా చదువు. చక్కగా నెరవేరితే, శిధిలావస్థలో ఉన్న మా ఊరి శివాలయానికి 50 వేలు ఇస్తానని మొక్కుకున్నారట నాన్న. మా ఆస్థి అమ్మగా వచ్చిన డబ్బుతో అక్కపెళ్ళి నా చదువు పూర్తయ్యాక, మిగిలిన 30 వేలు ఫిక్సిడ్ చేశారు నాన్న. నాన్న పోయే ముందు 'ఆ డబ్బు వాడొద్దని, మిగిలిన సొమ్ము జతచేసి మొక్కు తీర్చమని', ఆ బాధ్యత నా కప్పగించారు.

నాన్నపోయిన బాధలో ఆ డబ్బు గురించి నేను బాధపడలేదు కానీ, తరువాత ఏదైనా అవసరం వచ్చినప్పుడల్లా, ఆ డబ్బు వాడటానికి వీలులేక నాకు చాలా విసుగొచ్చేది. ఆ మాటే పైకి అంటే అమ్మ కంగారుగా 'అయ్యయ్యో! క్షమించమని చెంపలేసుకో!' అంటూ – నా తరుపున తనే క్షమాపణలు చెప్పుకొని ఒక కొబ్బరికాయ కొట్టటమో ఒకపూట ఉపవాసమో చేస్తుండేది. అమ్మపోయాక, ఆ బాధ్యత నా భార్య తీసుకుంది.

నా కొడుకు పెద్దవాడవుతుంటే, వాడి భవిష్యత్తు ఎలా ఉంటుందోనన్న ఊహ భయపెడుతుంటే, ఆ నాటి నాన్న ఆరాటం అర్థమై, ఇప్పుడు నా ఆర్థిక పరిస్థితి కూడా బాగానే ఉంది కనుక, ఆ మొక్కుబడి తీర్చేద్దామని బయలుదేరాను. హైవే పక్కన మట్టి రోడ్డులో కొన్ని మైళ్ళ ప్రయాణం చేస్తే కానీ, ఆ ఊరు చేరుకోలేము.

ఆ ఊర్లో పని ముగించుకుని, హైవేకు చేరుకుంటే, ఎక్కడ మంచి లాడ్జి దొరికితే అక్కడ ఆగి, తెల్లవారి బయల్దేరాలి. అని ఆలోచిస్తూ కారు నడుపుతున్నాను. మట్టిరోడ్డు దగ్గర కొస్తుందనగా రోడ్డు ప్రక్కన పాకలు కూడా పలచబడ్డాయి. లారీలు, ట్రాఫిక్ కూడా తగ్గిపోయింది. నా వెనక ఒక్కకారు మాత్రం ఉంది కొంచెం దూరంలో. ఇంతలో మట్టి రోడ్డులోకి తిరుగుతుండగా, ఒకపాకలోంచి ఒక కుర్రాడు గబుక్కున బయటికొచ్చాడు. అతి కష్టం మీద సడన్ బ్రేకుతో కీచుశబ్దంతో కంట్రోలు చేసుకున్నాను కానీ, అప్పటికే ఆ కుర్రాడు కింద పడిపోయాడు. అదృష్టం కొద్దీ ఆ కుర్రాడికేం జరగలేదు. కిందకి దిగేసరికి పిల్లాడు నెమ్మదిగా లేచి నిలుచున్నాడు. పాపం గుడ్డివాడు. చూసుకోకుండా అడ్డొచ్చాడని కోపంగా దిగాను కానీ, వాణ్ణి చూడగానే కోపం చల్లారిపోయింది. ఇంకా అక్కడుంటే గుడిసెలలో వాళ్ళు డబ్బుల కోసం నానా గోల చేస్తారేమోనని ఆ కుర్రాడిని వాడి గుడిసె దగ్గరికి తీసికెళ్ళాను. ఒక ముసలావిడ కుక్కి మంచంలో పడుకునుంది ఏమ్మా! కళ్ళు తిన్నగా కనవడని కుర్రాడిని అలా ఒదిలెయ్యటమేనా! ఏమన్నా జరిగితే అన్నాను. ఇంతకీ ఈ పిల్లాడు మీ తాలూకేనా? అన్నాను విసుగ్గా! ఏంచెయ్యమంటారు. బాబూ! రోజూ ఇంట్లోనే ఉంచుతా! నాకు జరంగా ఉంటే 'టీ' తెద్దామని ఆ ఎదురు బడ్డీ దగ్గరికి బయలుదేరాడు అంది.

పుట్టినప్పటినుంచీ ఇంతేనా! ఆపరేషన్ చేయించలేకపోయారా! అనేసి బాధపడ్డాను. ఆపరేషన్ వాళ్ళ పరిస్థితి ఎంత కష్టమో ఊహించి.

50 వేలు అవుతుందన్నారు. ఎక్కడ తేగలం బాబూ! వాడి తల్లి తండ్రి బస్సు ప్రమాదంలో పోయారు. పసివాడిగా ఉన్నప్పుడే కంటినరాలు దెబ్బతిన్నాయట, ఏదో నేనూ, మా ముసలాడు రోజూ కూలికెడితే రోజులు గడుస్తున్నాయి. చెట్టంత కొడుకు పోయాడు. కోడలు పోయింది. మాకు ఓపిక ఊపిరి ఉన్నంతకాలం పెంచుతాం. ఆ పైన దేవుడే ఉన్నాడు అంది ఆ ముసలమ్మ లేచి కూచుంటూ.

టౌన్లో అయితే ఆ పిల్లాణ్ణి అడ్డం పెట్టుకుని నా దగ్గర డబ్బు గుంజాలని ప్రయత్నించే వాళ్ళే! పోనీ ఏదైనా సాయం చేద్దామా! అనిపించింది. దేవుడి డబ్బు కదా! వీటిని కూడబెట్టటానికీ ఇంతకాలం పట్టింది. ఆ డబ్బులో వెలితి చేస్తే మళ్ళీ మొక్కు ఉండిపోతుంది. అవి కాకుండా ఇద్దామంటే కారు ప్రయాణం కదా! ఏ అవసరం వస్తుందో! ఒక్కరోజులో ఈ పల్లెటూర్లో అవసరమేముంటుందిలే! అని ఏటిఎం కార్డు కూడా తేలేదు. వందో రెండొందలో చేతిలో పెట్టి వెళ్ళిపోదామనుకుని పర్స్ తీశాను. ఇంతలో .

మామ్మా! అక్కడ పెద్ద చింత చెట్టుందికదా! పడిపోయింది. కారు మీద పడింది. కారు, మనిషి చెట్టుకింద ఉండిపోయారు. చుట్టుపక్కల పిల్లలుగా కాబోలు పరిగెత్తుకుంటూ వచ్చారు.

నా గుండె ఆగినంత పనయింది. నా కారుని ఓవర్‌టేక్ చేసిన కారన్నమాట ఈ పిల్లాడు అడ్డురాక పోతే? ఆ కారు స్థానంలో నా కారుండేది. నేను...? తలుచుకుంటే చెమట్లు పడుతున్నాయి.

నన్ను కాపాడటానికి ఆ దేవుడే ఈ పిల్లాడి రూపంలో వచ్చాడేమో! ఈ పిల్లాడు రాకపోతే? ఆ చెట్టు కిందపడి నేను చచ్చిపోతే? ఈ డబ్బు ఏమయ్యేదో! నాన్న మొక్కుమాట తరవాత, నా కొడుకు భవిష్యత్తేమయేదో! నా జీవితాన్ని నిలబెట్టిన ఆ పిల్లాడికి ఏదైనా సాయం చెయ్యాలని ఉంది కానీ, అంతకన్నా ముందు దైవదర్శనం చేసుకోవాలనుంది. వెంటనే బయలుదేరాను. ఆ హడావిడిలో ముసలమ్మకి డబ్బు ఇవ్వనేలేదు.

నాన్న చెప్పిన కర్ణంగారు ఊర్లోలేరు. నిరాశగా గుళ్ళో కూచున్నాను.

పంతులుగారు భాగవతం చదువుతున్నారు! 'మాధవుణ్ణి పూజించు. కానీ మానవుణ్ణి సేవించు" ఇంకా ఏదో చదువుతున్నారు! ఉలిక్కిపడి కళ్ళు తెరిచి దేవుడి కేసి చూశాను.

మూర్ఖుడా! ఇంకా అర్థంకాలేదా! అన్నట్టుగా నాకేసి చూస్తున్నట్లనిపించింది.

వెంటనే నా కర్తవ్యం స్ఫురించింది. గుడి మరమ్మత్తులు జరిగాయి. ఇదివరకటిలాగా శిధిలావస్థలో లేదు. ఆ పిల్లవాడి కళ్ళు ఆపరేషనే భగవత్ సంకల్పం. అందుకే నన్ను రక్షించాడు. చీకటి పడకుండా ఆ పాక దగ్గరికెళ్లి ఆ ముసలాళ్ళకి డబ్బు ఇచ్చి, రేపే హాస్పిటల్‌లో జాయిన్ చెయ్యమని చెప్పాలి. అనుకుంటూ కారు వేపు నడిచాడు.